క్లుప్తంగా

పూలే సేవలు ఎనలేనివి

రేపల్లె రూరల్: మహిళల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిబా పూలే దంపతుల సేవలు ఎనలేనివని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు శీలం ఏసమ్మ అన్నారు. పట్టణంలోని 13వవార్డు ఉప్పూడి రోడ్డులోని పీవోడబ్ల్యూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్త్రీ, పురుష భేదభావాన్ని రూపుమాపడానికి పూలే దంపతులు విశేష కృషిచేశారని చెప్పారు. ప్రస్తుతం మహిళలపై లైంగికదాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని, వీటి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుదిట్ట చట్టాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గరిజ, కుమారి, చిన్న సముద్రాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

పీవీపాలెం ఎంపీడీఓగా సత్యనారాయణ



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండల అభివృద్ధి అధికారిగా ఐ.సత్యనారాయణ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణను పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. కొల్లూరు ఎంపీడీఓగా పనిచేస్తూ సత్యనారాయణ బదిలీపై పీవీపాలెం వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన మారుతీ శేషమాంబ అమర్తలూరు ఎంపీడీఓగా వెళ్ళారు.

జాబ్‌మేళా ద్వారా 19 మంది ఎంపిక

వేమూరు: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు చెప్పారు. వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా జరిగింది. మేళాలో 50 మంది పాల్గొనగా 19 మందిని కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారు. ఏటా జాబ్‌మేళాలు నిర్వహిస్తామని తమ్మాజీరావు చెప్పారు. వీటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంట్ అధికారి బి.శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్ అరుణ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



కర్లపాలెం: సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు ఆదేశించారు. కర్లపాలెం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. రోజూ అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి కూరగాయలు, దుప్పట్లు పంపిణీ



భట్టిప్రోలు: వరద బాధితుల సహాయార్థం భట్టిప్రోలు మండలం చింతమోటు కొత్త కాలనీకి చెందిన ఎమ్మార్పీసీటీ నిర్వాహకులు, పాస్టర్ పల్లికొండ రత్నం అండ్ బ్రదర్స్ శుక్రవారం 200 మందికి కూరగాయలు, దుప్పట్లు పంపిణీ చేశారు. గతంలో వరదల సందర్భంలో బాధిత కుటుంబాలకు 15 రోజులపాటు భోజనం పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రకాష్, రాజు, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి


తెనాలిరూరల్: సమాచార హక్కు చట్టం 2005పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొలకలూరు గ్రామంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చట్టంపై అవగాహన ఉంటే అవసరమైన సమాచారాన్ని సేకరించడం సులువు అవుతుందన్నారు. మండల విద్యాశాఖ అధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి. జయంతి బాబు, మండల వ్యవసాయశాఖ అధికారి జి. ప్రేమ్‌సాగర్, మాట్లాడారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

తెనాలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెనాలి నియోజకవర్గస్థాయిలో అండర్–14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో గుడిమెట్ల అనురూప్ నోయల్ ప్రథమ స్థానంలో నిలిచాడు. స్థానిక అయితానగర్‌లలోని ఎన్ఎస్ మునిసిపల్ హైస్కూలులో ఈ పోటీలు జరిగాయి. శుక్రవారం కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో నోయల్‌ను అధ్యాపకబృందం అభినందించింది.

మూగబోయిన మగ్గం

- భారీ వర్షాలకు నేతన్న విలవిల
- గుంతల్లోకి నీరు చేరి ఆగిన పనులు
- చేనేత వాడల్లో ఆకలి కేకలు



ఐలవరంలో చేనేత మగ్గం దోనె ఎత్తివేసిన దృశ్యం



మగ్గం గుంతలో నీళ్లు తోడుతున్న నేతన్న

భట్టిప్రోలు: భారీ వర్షాలకు మగ్గాలు మూగబోయాయి. గుంతల్లో నీరు చేరి పనులు ఆగిపోయాయి. గత నెలరోజులుగా ఇదే దుస్థితి ఉండడంతో చేనేత వాడలు ఆకలితో అలమటిస్తున్నాయి. భట్టిప్రోలు మండలంలో అద్దేపల్లి, ఐలవరం, భట్టిప్రోలు, కోనేటిపురం ప్రాంతాలలో చేనేత వాడలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో 500 మగ్గాలు పనిచేస్తాయి. సుమారు 1,800 కార్మిక కుటుంబాలు వీటిపై ఆధారపడి జీవిస్తున్నాయి. నెలరోజులుగా తరచుగా భారీ వర్షాలు పడడంతో మగ్గాల గుంతల్లోకి నీరు చేరింది. ఫలితంగా పనులు ఆగిపోయాయి. వాతావరణం తెరిపిస్తేగానీ మగ్గాలు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. గుంతల్లో నీరు తోడినా మళ్లీ ఊట వస్తుందని చేనేత కార్మికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వర్షాలు, తుఫాన్లు, అల్పపీడనాల వల్ల తమ జీవనోపాధికి విఘాతం కలుగుతోందని, ఈ కాలంలో తమకు భృతి ఇచ్చి ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో నేతన్ననేస్తం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని గత ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. నేతన్న నేస్తం పథకాన్ని ఐదేళ్లపాటు క్రమం తప్పకుండా అమలు చేసింది. కార్మికులకు ఏటా రూ.24 వేలు వారి ఖాతాల్లో జమ చేసింది. కరోనా కష్టకాలంలోనూ చేనేత కార్మికులకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పథకం గురించి ప్రస్తావన లేదు. చేనేత కార్మికులను ఆదుకునే నాథుడు లేకుండా పోయారు. భట్టిప్రోలు మండలంలో నేతన్ననేస్తం ద్వారా 750 మందికి ఏటా రూ.1.80 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఐదేళ్లలో రూ.9 కోట్ల ప్రయోజనం కలిగింది. బాపట్ల జిల్లాలోని 8,705 కుటుంబాలకు రూ.24 వేలు చొప్పున రూ.20.89 కోట్ల మేర లబ్ధి జరిగింది.

భత్యం ఇవ్వాలి



2019కి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు ఏడాదిలో 2 నెలలు నెలకు రూ.4 వేలు చొప్పున భత్యం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని ఇప్పటికైనా అమలు చేస్తే బాగుంటుంది. ప్రతికూల వాతావరణంలో నాణ్యమైన వస్త్రోత్పత్తి చేయలేకపోతున్నాం. మగ్గాల్లో నీరు బయటకు పోయేందుకు చాలా రోజులు పడుతుంది.

– గోలి ధర్మారావు, ఐలవరం, భట్టిప్రోలు

జీవనోపాధి సాయం అందించాలి



వేట విరామ సమయంలో మత్స్యకార భరోసా అమలు చేసిన విధంగానే నేతన్నలకు కూడా సహాయం అందిస్తే బాగుంటుంది. పని విరామ సమయంలో 2 నెలల పాటు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలి. జీవనోపాధి కల్పించేందుకు నెలకు రూ. 5 వేలు చొప్పున ప్రభుత్వం అందించాలి. గత ప్రభుత్వం నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసింది.

– అడిగోపుల రమాదేవి, ఐలవరం, భట్టిప్రోలు

ఉచిత విద్యుత్ హామీ నిలబెట్టుకోవాలి



జీఓ నంబర్ 291 ప్రకారం చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలి. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నేత నేస్తున్న కార్మికులకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చారు. దీనిని తక్షణం అమలు చేయాలి.

–ఎం. సత్యనారాయణ,
ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తుషార్‌డూడీ హెచ్చరించారు. జిల్లాలో బదిలీ అయిన 175 మంది సిబ్బందికి శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ జిల్లాలో 102 మంది సిబ్బందిని వారి కోరిక ప్రకారం బదిలీ చేశామని పేర్కొన్నారు. 73 మందిని ఐదేళ్లు నిండిన వారిగా గుర్తించి బదిలీ చేశామన్నారు. పోలీస్ సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని, అదే సమయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ సిబ్బంది వ్యక్తిగత, శాఖ పరమైన సమస్యలను పరిష్కరించడానికి 'గ్రీవెన్స్‌డే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోలీస్ సిబ్బంది బదిలీపై వెళ్ళిన పోలీస్ స్టేషన్లో నిబద్ధతతో పని చేయాలన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పూజలు

భట్టిప్రోలు: తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీసేలా సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం భట్టిప్రోలు మండలంలోని దేవాలయాలలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని) శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను కించపరిచిన సీఎం చంద్రబాబు వ్యవహారశైలి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

స్వచ్ఛ రేపల్లె కోసం కృషి చేద్దాం

రేపల్లె రూరల్: స్వచ్ఛ రేపల్లె సాధనలో అందరూ భాగస్వాములు కావాలని ఎన్‌సీసీ కేర్ టేకర్ కె.బాలగురవయ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. బాలగురవయ్య మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోపాటు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ నడుం కట్టాలని సూచించారు. పాలిథీన్ రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సేవ్ రేపల్లె–గ్రీన్ రేపల్లె అని నినాదాలిస్తూ రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎం.దాసు, కళాశాల అధ్యాపకులు పి.మురళి, బి.కోటేశ్వరరావు, వీవీ రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛతాహీ కార్యక్రమం

ప్రపంచ పర్యాటక దినోత్సవం

పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. చరిత్ర అధ్యాపకుడు ఎం.దాసు విద్యార్థులతో చారిత్రక ప్రదేశాల పరిశీలన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కే.బాల గురవయ్య, రవీంద్ర, బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్



ప్రతిభ చూపిన సూరేపల్లి హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాసశర్మ

వేమూరు/భట్టిప్రోలు: స్కూల్‌గేమ్స్ నియోజకవర్గ స్థాయి పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వేమూరు మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్–14, 17 బాలబాలికల విభాగాల్లో వాలీబాల్, ఖో ఖో, చెస్ నియోజకవర్గ స్థాయి పోటీలు జరిగాయి. పోటీలను ఎంఈఓ–2 రోజ్‌ల్యాండ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ జి.శివనాగులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం యుగంధర్, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, టి.బుచ్చి రెడ్డి , నాగేశ్వరరావు, శ్రీను, డి.శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన 24 మంది విద్యార్థులు సత్తాచాటారు. వాలీబాల్, చెస్, ఖోఖో పోటీల్లో బాలబాలికల విభాగాల్లో విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ విద్యార్థులు 11 మంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలబాలికలకు శిక్షణ ఇచ్చిన పీఈటీలు నాగేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, ఎండీ అనూల్ హక్‌ను ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస శర్మ, చందలూరి రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు



ప్రతిభ చూపిన భట్టిప్రోలు హైస్కూల్ విద్యార్థులు

పోలీసుల పల్లెనిద్ర



భట్టిప్రోలు: జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశానుసారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో శుక్రవారం పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద వేమూరు సీఐ పి.ఆంజనేయులు నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నేరాల సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100, 112 నంబర్లకు కాల్ చేసి చెప్పాలని సూచించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం సీఐతోపాటు ఎస్ఐ ఎం.శివయ్య రాత్రి అక్కడే బస చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొజ్జా రవి, ఎంపీటీసీ సభ్యులు వాకా వెంటనారాయణ, దారావత్ కుమారీభాయ్, గ్రామ పెద్దలు మోటూరు పుణ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూలు విద్యార్థుల క్షేత్ర సందర్శన



తెనాలిరూరల్: క్షేత్ర సందర్శనలో అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో గల టెక్స్‌టైల్స్ విభాగంలోని హ్యాండ్లూమ్స్, కుట్టుమిషన్లు, డైయింగ్ మిషన్ల పనితీరును శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అనురాధ పర్యవేక్షణలో లెర్నెట్‌స్కిల్స్ సంస్థ సహకారంతో విద్యార్థులను యూనివర్సిటీకి తీసుకెళ్లారు. యూనివర్సిటీలో టెక్స్‌టైల్ విభాగం హెచ్‌వోడీ సీహెచ్. గోవర్ధన్ రావు, ఎం. శివ జగదీష్‌కుమార్ టెక్స్‌టైల్ రంగానికి సంబంధించి విద్యార్థులకు పలు వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు వృత్తి విద్యా శిక్షకులు టి. వెంకటేశ్వరమ్మ, ఇ.అమర్నాథ్ పాల్గొన్నారు.

మేరుగ నాగార్జునకు సత్కారం



వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జునను సత్కరిస్తున్న రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ దంపతులు

వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ మేరుగ నాగార్జున శుక్రవారం చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈవూరు గణేష్ – కేశవతి దంపతులు నాగార్జునను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామస్థాయి నాయకుల నుంచి ప్రతి ఒక్క వైఎస్సార్ సీపీ నాయకుడిని, కార్యకర్తను కలుపుకుని పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు. – రేపల్లె రూరల్

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వెల్లటూరు(భట్టిప్రోలు): రాష్ట్ర విద్యా శాఖ ఆదేశానుసారం స్వర్ణాంధ్ర– 2047 అనే అంశంపై మండల స్థాయిలో భట్టిప్రోలు మండలం వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నీలం దేవరాజు మాట్లాడుతూ వ్యాసరచన పోటీలలో వి.మధు నాగ శ్రీవల్లి (సూరేపల్లి), ఎస్. మేఘన (పెసర్లంక), జి. వర్షిణి (వెల్లటూరు) వక్తృత్వ పోటీలలో ఎస్.నవ్య (సూరేపల్లి), జి. వర్షిణి (వెల్లటూరు), వి. మధు నాగ శ్రీవల్లి (సూరేపల్లి)లు ప్రతిభ చూపినట్లు వివరించారు. న్యాయ నిర్ణేతలుగా జి.మురళీమోహన కె.శివరామకృష్ణ వ్యవహరించగా, పోటీలను హెచ్‌ఎం కె.అరుణ కుమారి పర్యవేక్షించారు.

మానవాళికి భగవద్గీత మార్గదర్శి



భట్టిప్రోలు: మానవాళికి భగవద్గీత మార్గదర్శి అని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇ.అమ్మడు తెలిపారు. శుక్రవారం భట్టిప్రోలు విశ్వశాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత వచన భగవద్గీత పుస్తకాలను అందజేశారు. అమ్మడు మాట్లాడుతూ భగద్గీత పఠనం ద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మండల ధార్మిక మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి, కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రిన్సిపాల్ ఫణి పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డంపు.. కంపు



ఈ చిత్రం రేపల్లె పేటేరు వెళ్లే రహదారిలో డంపింగ్ యార్డు సమీపంలోనిది. పట్టణంలో సేకరించిన చెత్తను ఇక్కడి డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. యార్డు నుంచి చెత్త రహదారిపైకి చేరింది. శుక్రవారం కురిసిన వర్షానికి చెత్తాచెదారం తడిచి దుర్గంధం వెదజల్లింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డంపింగ్‌యార్డు నుంచి వర్షపు నీరు ఎటూ వెళ్లే దారి లేకపోవడంతో చెత్త కుళ్లి కంపుకొడుతోంది. అధికారులు తక్షణం స్పందించి రహదారిపై నుంచి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షపునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– రేపల్లె రూరల్

• అనాథకు అంత్యేష్టి సంస్కారం



అనారోగ్యంతో జిల్లా వైద్యశాలలో మృతి చెందిన అనాథకు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు శుక్రవారం అంత్యక్రియలను నిర్వహించారు. వివరాలోకి వెళ్ళితే కె.విజయ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా వైద్యశాలలో చేరాడు. నాలుగు రోజుల తరువాత అతడు మృతి చెందడంతో త్రీటౌన్ పోలీసులు, 26వ వార్డు కౌన్సిలర్ నూరు ఇస్మాయేల్ ఈ విషయాన్ని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు తెలియజేశారు. అతనికి ఎవరు లేరని, అనాథ అని అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. దీంతో వారు బుర్రిపాలెం రోడ్డులోని మహా ప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు మల్లెల వాసు, బి.పోతురాజు పాల్గొన్నారు.

–తెనాలిఅర్బన్

శుక్రవారాన్ని డ్రైడేగా పాటించండి

తెనాలిఅర్బన్: శుక్రవారాన్ని ప్రతి ఒక్కరూ డ్రైడేగా పాటించాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో నాజర్‌పేటలో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులు అని తెలిపారు. వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.